సాక్షి విశాఖపట్నం

శనివారం। 22। ఫిబ్రవరి। 2025



రోస్టర్ సరిచేసి.. గ్రూప్-2 నిర్వహించాలి 8లో



వియత్నాంలోని కామ్ రాన్ బే పోర్టుకు చేరుకున్న ఐఎన్ఎస్ టిర్, ఐసీజీఎస్ వీరా నౌకలు

వియత్నాంలో భారత నౌకలు

సింథియా: ఇండియన్ నేవీ ఫస్ట్ ట్రైనింగ్ స్క్వాడ్రన్‌కు చెందిన ఐఎన్ఎస్ టిర్, ఐసీజీఎస్ వీరా నౌకలు వియత్నాంలోని కామ్ రాన్ బేకు చేరుకున్నాయని నేవీ వర్గాలు తెలిపాయి. వియత్నాం నేవీ సిబ్బంది, అక్కడ భారత మిషన్ సభ్యులు ఈ నౌకలకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య దీర్ఘకాల స్నేహాన్ని, సహకారాన్ని మరింతగా పెంచుతుందని నేవీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. సందర్శనలో భాగంగా నేవీ బృందాలు వివిధ కార్యకలాపాల్లో పాల్గొన్నాయి. పోర్ట్ కాల్, వివిధ క్రాస్-ట్రైనింగ్ కార్యకలాపాలు, వియత్నాం నావల్ అకాడమీ సందర్శన తదితర కార్యక్రమాలు జరిగాయి. వియత్నాం నేవీ, కోస్ట్ గార్డ్‌లతో ద్వైపాక్షిక విన్యాసాలతో ఈ పర్యటన ముగుస్తుందని నేవీ అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాం తనిఖీ



ఈవీఎం గోదాం షట్టర్‌కు వేసిన సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని ఈవీఎం గోదాంను శుక్రవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా గోదాం షట్టర్‌కు వేసిన సీల్ పరిశీలించారు. గోదాం లోపల సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. భద్రతా ప్రమాణాలు గురించి సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీవీ ప్యాట్‌లు, ఈవీఎం బాక్సులు పరిశీలించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

రూ.3.41 కోట్ల ఆస్తి పన్ను చెల్లించిన స్టీల్‌ప్లాంట్



ఆస్తి పన్ను చెక్కుతో జీవీఎంసీ అధికారులు

గాజువాక : జీవీఎంసీకి విశాఖ స్టీల్‌ప్లాంట్ శుక్రవారం రూ.3,41,47,156 ఆస్తి పన్ను చెల్లించింది. ఇందుకు సంబంధించిన చెక్కును జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రి, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్‌నారాయణ, రెవెన్యూ అధికారి ఎం.శ్రీకాంత్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌కు స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులు అందజేశారు. ఆర్ఐ శివ తదితరులు పాల్గొన్నారు.

యువ క్రీడాకారులకు 'ఎఫ్‌సీఐ' ప్రోత్సాహం

విశాఖ స్పోర్ట్స్: మీరు ఔత్సాహిక క్రీడాకారులా? అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించాలనే పట్టుదలతో ఉన్నారా? అయితే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మీకు ఆర్థికంగా అండగా నిలవడానికి స్టైఫండ్‌ను అందిస్తోంది. ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్లో రాణిస్తున్న బాలురు, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ క్రీడల్లో రాణిస్తున్న బాలబాలికలు ఈ ప్రోత్సాహకాన్ని అందుకోవచ్చు. 15-18, 18-24 సంవత్సరాల వయసు గల వారు ఇందుకు అర్హులు. సిటీ లేదా గ్రామీణ ప్రాంతం అనే తేడా లేదు. మీరు అర్హులైతే వెంటనే www.fci.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి, మార్చి 6వ తేదీలోపు మీ పేరును నమోదు చేసుకోండి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రీడా రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోండి.

మరో ముగ్గురు జైలు అధికారులకు మెమోలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం అధికారులకు మెమోల జారీ కొనసాగుతోంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులను గుర్తించి రాష్ట్ర జైళ్ల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార విశ్వజిత్ మెమోలు జారీ చేస్తున్నారు. ఈ నెల 18న నలుగురికి, 19న ఇద్దరికి మెమోలు జారీ చేయగా, శుక్రవారం జైలర్లు ఐ.మురళీ, టి.దుర్గారావు, ఎ.ఈశ్వరరావులకు కూడా మెమోలు అందజేశారు. దీంతో నాలుగు రోజుల వ్యవధిలో మెమోలు అందుకున్న అధికారుల సంఖ్య 9కి చేరింది. వీరిలో ఇక్కడ నుంచి అనంతపురం ఓపెన్ ఎయిర్ జైల్‌కు బదిలీ అయిన ఒక సూపరింటెండెంట్, నెల్లూరుకు బదిలీ అయిన అడిషనల్ సూపరింటెండెంట్, ప్రస్తుతం ఇక్కడే విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్‌తో పాటు ఇక్కడ విధుల్లో ఉన్న ఆరుగురు జైలర్లు ఉన్నారు. ఇంకా మరికొందరు అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

25న షాలిమర్- విశాఖ ఎక్స్‌ప్రెస్ రద్దు


తాటిచెట్లపాలెం: నిర్వహణ పనుల కారణంగా ఆయా మార్గాల్లో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 25న సంత్రగచ్చి-చెన్నై సెంట్రల్(22807) ఎక్స్‌ప్రెస్, షాలిమర్-విశాఖపట్నం(22853) ఎక్స్‌ప్రెస్, 26న విశాఖపట్నం-షాలిమర్(22854) ఎక్స్‌ప్రెస్, 27న చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి (22808) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని సూచించారు.

● తిష్ట వేసిన టెస్టర్లు..
ముట్టుకుంటే షాకే..!

ఈపీడీసీఎల్‌లో వారంతా సాధారణ ఉద్యోగులే. అయినప్పటికీ కార్పొరేట్ కార్యాలయాన్నే శాసిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఒకే చోట పాతుకుపోయారు. వారి ఆగడాలు శృతి మించుతుండటంతో, అక్కడి నుంచి బదిలీ చేయాలని ప్రయత్నించిన అధికారులకే ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు వచ్చి చెట్టుకొకరు, పుట్టకొకరుగా ఎగిరిపోయారు. కానీ వారు మాత్రం లోకల్ అంటూ అక్కడే తిష్ట వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత, బదిలీ చేసిన మూడు రోజుల్లోనే తిరిగి పాత గూటికి చేరుకున్నారంటే.. వారి రూటే సెప'రేటు'అని అర్థం చేసుకోవచ్చు. ఎంఆర్టీ డివిజన్‌లో టెస్టర్లుగా విధులు నిర్వహిస్తున్నా.. సీజీఎంల కంటే పవర్ ఫుల్‌గా వ్యవస్థను మేనేజ్ చేస్తున్న ఘనులు కోట్లకు పడగలెత్తారన్న ఆరోపణలు ఉన్నాయి.

– సాక్షి, విశాఖపట్నం

- రెండు, మూడు దశాబ్దాలుగా ఒకే చోట విధులు
- ఈపీడీసీఎల్‌నే శాసిస్తున్న ఎంఆర్టీ డివిజన్ టెస్టర్లు
- బదిలీ చేసిన 3 రోజుల్లోనే మళ్లీ యథాస్థానానికి..
- వారిపై చర్యలకు యత్నించిన ఏఈలకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు
- కార్పొరేట్ కార్యాలయంలోనూ చక్రం తిప్పుతున్న ఆ ఐదుగురు



ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కొందరు ఉద్యోగులకు మాత్రమే కొమ్ముకాస్తున్న వ్యవస్థగా మారిపోయింది. రాజకీయ మద్దతు, ఉన్నతాధికారుల అండదండలు ఉంటే దశాబ్దాలుగా ఒకే చోట కాలు కదపకుండా పాతుకుపోవచ్చు. ఇందుకు గోపాలపట్నంలోని ఎంఆర్‌టీ డివిజన్ ఉద్యోగులే నిదర్శనం. ఆ డివిజన్‌లోని మీటర్స్ సెక్షన్‌లో ఐదుగురు ఉద్యోగులు దశాబ్దాలుగా ఈపీడీసీఎల్‌ను ఏలుతున్నారు. ఎల్‌టీ మీటర్ సెక్షన్‌లో జేఎల్ఎం నుంచి ఫోర్‌మన్ గ్రేడ్-2గా అక్కడే ఎదిగిన ఒక ఉద్యోగి ఏకంగా 32 ఏళ్ల పాటు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక హెచ్‌టీ సెక్షన్‌లో టెస్టర్ గ్రేడ్-1, 2 విభాగాలకు చెందిన ముగ్గురు ఉద్యోగుల్లో ఒకరు 29 ఏళ్లుగా, మరొకరు 25 ఏళ్లుగా, ఇంకొకరు 23 ఏళ్లుగా తిష్ట వేసుకుని కూర్చున్నారు. సిటీ మీటర్ సెక్షన్‌లో టెస్టర్ గ్రేడ్-1 ఉద్యోగి 21 ఏళ్లుగా ఆ విభాగాన్ని ఏలుతున్నారంటే.. ఈపీడీసీఎల్‌లో వీరి పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు

బదిలీ అయినా.. మళ్లీ అక్కడికే.!

ఒక్కొక్క ఉద్యోగి 20 నుంచి 30 సంవత్సరాలకు పైగా ఒకే చోట తిష్ట వేసుకొని కూర్చోవడంతో... విధుల పట్ల వారు నిర్లక్ష్యం వహించినా ప్రశ్నించేవారు కరువయ్యారు. జూనియర్లుగా విధుల్లోకి వస్తున్న వారిపైనే విధుల భారం మొత్తం మోపుతున్నారు. వీరు చెప్పినట్టు వినకపోతే, జూనియర్లకు బదిలీ వేటు తప్పదు. అల్లూరి లేదా శ్రీకాకుళం జిల్లాలకు బదిలీ చేయించేస్తారు. తమ సెక్షన్ పరిధిలో ఎవరికైనా బదిలీ కావాలంటే, ఈ ఉద్యోగుల సిఫారసు తప్పనిసరిగా మారింది. ఈపీడీసీఎల్ ఎంఆర్టీ డివిజన్‌లో ఎవరిని ఎక్కడికి బదిలీ చేయాలో వీరి కనుసన్నల్లోనే ఉన్నతాధికారులు చేస్తుంటారని విమర్శలూ ఉన్నాయి. వీరి ఆగడాలు భరించలేక.. ఏఈలు, డీఈలు ఎవరైనా సదరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే.. ఆ అధికారులకే ఎదురుదెబ్బ తగులుతుంది. ఫిర్యాదులు చేసిన వారందరూ గోపాలపట్నం కార్యాలయం నుంచి బదిలీ అయిపోయారే తప్ప.. వీరిని మాత్రం కదిలించలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఇటీవల జరిగిన బదిలీల్లో ఏడాది కాలం పనిచేసిన ఉద్యోగులను సైతం ఈపీడీసీఎల్ అధికారులు బదిలీ చేశారు. కానీ, ఈ ఉద్యోగుల జోలికి మాత్రం పోలేదు. ఈ వ్యవహారంపై కొందరు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయడంతో హడావుడిగా ఈ ఐదుగురినీ అనకాపల్లి, విజయనగరం, అల్లూరి జిల్లాలకు బదిలీ చేశారు. అయితే, కేవలం మూడు రోజుల్లోనే వీరంతా గోపాలపట్నం కార్యాలయానికి తిరిగి వచ్చేయడం గమనార్హం. గతంలో ఒకటి రెండు సార్లు బదిలీ చేసినా, నెల రోజుల్లోనే తిరిగి గోపాలపట్నంలో ప్రత్యక్షమయ్యారు.

విజి'లెన్స్'కూడా లేదు

చేసేది చిన్న ఉద్యోగమైనా వీరంతా కోట్లకు పడగలెత్తినట్లు తెలుస్తోంది. తమ సెక్షన్ పరిధిలో ఏ పనికి వచ్చినా వినియోగదారుల నుంచి లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంఆర్టీ డివిజన్‌లో ఎల్‌టీ మీటర్, హెచ్‌టీ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ విభాగాలుంటాయి. ఎంఆర్టీ యూనియన్ రా'రాజు'గా చెలామణి అవుతూ మూడు దశాబ్దాలుగా ఎల్‌టీ మీటర్ సెక్షన్‌లోనే పనిచేస్తున్నారు. ఎవరికైనా ఎక్కువ బిల్లు వస్తే మీటర్ టెస్టింగ్‌కు దరఖాస్తు చేసుకుంటారు. ఈ సమయంలోనే వీరంతా తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తారు. ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్ల సహకారంతో మీటర్‌లో తప్పుందంటూ సర్టిఫై చేసి వినియోగదారుల దగ్గర నుంచి అందినకాడికి గుంజుకుంటారు. వీరిపై పలుమార్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని సమాచారం. వీరికి గోపాలపట్నం కార్యాలయంలోని కొందరు అధికారులతో పాటు ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలుస్తోంది. పలు మార్లు ఎంఆర్టీ ఉద్యోగుల వ్యవహారశైలిపై ఈపీడీసీఎల్ విజిలెన్స్ అధికారులకు కూడా ఫిర్యాదులు అందినా కనీసం స్పందించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

వందేళ్ల రైల్వే విద్యుదీకరణ వేడుకలు



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ

తాటిచెట్లపాలెం: భారతీయ రైల్వేలో విద్యుదీకరణ జరిగి వందేళ్లయిన సందర్భంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో వేడుకలు ఘనంగా జరిగాయి. డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ ఆధ్వర్యంలో దొండపర్తి డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ మొదటి ఎలక్ట్రికల్ రైలు 1925 ఫిబ్రవరి 3న ప్లాట్‌ఫాం 2 పూర్వపు విక్టోరియా టెర్మినస్(ప్రస్తుత ఛత్రపతి శివాజీ టెర్మినస్) నుంచి కుర్లా స్టేషన్‌కు నడిచిందన్నారు. దీనికి గుర్తుగా భారతీయ రైల్వే పరిధిలో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వందేళ్లలో జరిగిన ప్రగతిపై ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్(ట్రాక్షన్) బి.షణ్ముఖరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో డివిజన్ పరిధి పలు విభాగాలకు చెందిన సుమారు 200 మంది ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేకు ముందే రైతులకు సమాచారం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

తగరపువలస: రీ సర్వే చేపట్టే గ్రామాల్లో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, నిబంధనల మేరకు సంబంధిత నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. భీమిలి మండలం దాకమర్రిలో శుక్రవారం ఆయన పర్యటించారు. భూముల రీ సర్వే ప్రక్రియను అధికారులతో పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను గమనించారు. రైతులతో మాట్లాడి, రీ సర్వేపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. భూముల పరిరక్షణ, సరిహద్దుల గుర్తింపు, దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చేపడుతున్న ఈ ప్రక్రియకు రైతులు సహకరించాలన్నారు. రైతులు దగ్గరుండి సర్వే చేయించుకోవాలని సూచించారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. అనంతరం దాకమర్రి గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వస్తున్న వినతులు పరిశీలించారు. పంచాయతీలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట భీమిలి తహసీల్దార్ రామారావు తదితరులు పాల్గొన్నారు.



దాకమర్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

భూ కుంభకోణ నివేదికను బయటపెట్టండి

- బురదజల్లడం కాదు.. ఆరోపణలు నిరూపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..
- గ్రూప్-2 అభ్యర్థులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- కూటమి ప్రభుత్వం తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీపై స్పష్టతే లేదు
- మీడియాతో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, చిత్రంలో మాజీ మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే తైనాల

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో భూ కుంభకోణాలకు సంబంధించి జరిపిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలని ఏపీ శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఊరికే బురదజల్లడం కాదు.. ఆరోపణలను నిరూపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని.. ఇదే వేదికపై నుంచి అనేక సార్లు ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. ఈ ప్రభుత్వానికి నచ్చినట్లే 2004 లేదా 2014 వరకు, ఏ సంవత్సరం నుంచి అయినా విచారణ జరిపిన నివేదికను బయటపెట్టాలన్నారు. శుక్రవారం లాసన్స్‌బేకాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. గుంటూరు మిర్చి యార్డ్‌లో గిట్టుబాటు ధర లేక, దళారీ విధానంతో ఇబ్బందుల పడుతున్న రైతులను పరామర్శించడానికి మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళితే చట్ట వ్యతిరేక కార్యక్రమంటూ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వైఎస్ జగన్‌కు రక్షణ కల్పించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగానే చంద్రబాబు విజయవాడలో మ్యూజికల్ నైట్‌లో పాల్గొన్నారని, కోడ్ ఉన్నప్పుడే యూనివర్సిటీలకు వీసీ నియామకాలు చేపట్టారని గుర్తు చేశారు. ఢిల్లీలో బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి వెళ్లిన చంద్రబాబు, మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో మాట్లాడేందుకు వెళ్లినట్లు అబద్ధాలు చెప్పడం ఆయనకే చెల్లిందన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి లేరన్న విషయం ముందుగానే తెలియదా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి వ్యవసాయం, రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని.. చంద్రబాబు ఎప్పుడూ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించిన దాఖలాల్లేవన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమా..?

గ్రూప్-2 మెయిన్స్ రోస్టర్ పాయింట్ సమస్యలపై ఉన్న అభ్యంతరాలను సహేతుకంగా పరిష్కరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు తొలి సంతకం చేసిన డీఎస్సీ పరిస్థితే వాయిదాల మీద వాయిదాలు పడుతుంటే.. కూటమి పార్టీలు ఇచ్చిన హామీల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలకు అర్థమవుతోందన్నారు.

నలభై ఏళ్ల కళావైభవం.. కూచిపూడి కళాక్షేత్రం



కళాభారతిలో ఘనంగా వార్షికోత్సవం

మద్దిలపాలెం: ఆరేళ్ల చిన్నారి నుంచి 60 ఏళ్ల సీనియర్ నాట్య కళాకారులు వారి నాట్య విన్యాసాలతో కళాప్రియుల హృదయాలను సమ్మోహపరిచారు. కూచిపూడి కళాక్షేత్రం 40వ వార్షికోత్సవం శుక్రవారం మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. రాష్ట్ర కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీనియర్, జూనియర్ కళాకారులు వారి నాట్య సోయగాలతో అందరి హృదయాలను రంజింపచేశారు. ఈ సందర్భంగా నటరాజ్ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ పద్మభూషణ్ అవార్డు గ్రహీత వెంకటేశ్వర సత్యం 40 ఏళ్ల కిందట విశాఖలో స్థాపించిన కూచిపూడి కళాక్షేత్రం ఎందరో కళాకారులను తయారు చేసిందన్నారు. కళాక్షేత్రంలో 1985 నుంచి 2025 వరకు నేర్చుకున్న పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు కలిపి 100 మంది నృత్య ప్రదర్శనలు ఇవ్వడం అద్భుతమైన ఘట్టమన్నారు. కళాక్షేత్ర గురువు హరి రామమూర్తి దర్శకత్వంలో తారకాసుర సంహారం అను నృత్య రూపకం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ శ్యాం ప్రసాద్, కళాభారతి అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ మధుసూదన రావు, కూచిపూడి కళాక్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ సూరపనేని విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ మిత్ర, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ శ్రీనివాస్, శైలజ పాల్గొన్నారు.

జీబీఎస్‌పై ఆందోళన వద్దు

కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్. చిత్రంలో వైద్యులు

మహారాణిపేట: గులియన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) అంటువ్యాధి కాదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ భరోసానిచ్చారు. ఆంధ్రా మెడికల్ కళాశాల సెమినార్ హాల్లో శుక్రవారం నిర్వహించిన పీజీ విద్యార్థులు, జూనియర్ వైద్యుల ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగించారు. కేజీహెచ్‌లో నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని, కేసులు పెరుగుతున్నా భయాందోళన చెందనక్కర్లేదన్నారు. కేజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి మాట్లాడుతూ జీబీఎస్ వ్యాధి గురించి సమగ్రంగా వివరించారు. క్లినికల్ ప్రజెంటేషన్, డయాగ్నస్టిక్ విధానాలు, సమకాలీన చికిత్స వ్యూహాల్లో కీలక విషయాలను తెలిపారు. ఇది కరోనా వైరస్‌లా అంటువ్యాధి కాదని, ఇమ్యూన్ సిస్టం వల్ల నాడీ వ్యవస్థ పై పోర దెబ్బ తిని ఈ వ్యాధి బారిన పడతారని వివరించారు.

Smart పానీపూరి



ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అన్ని రంగాల్లోనూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో యువత, ముఖ్యంగా అమ్మాయిలు ఎంతగానో ఇష్టపడే పానీపూరిని సైతం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్నారు. వ్యాపారులు ఇప్పటికే పానీపూరిలో వివిధ రకాల పానీయాలను పరిచయం చేయగా, ఇప్పుడు సెన్సార్ ఆధారిత స్మార్ట్ విధానంతో పానీని పూరీలోకి పోసే సరికొత్త పద్ధతిని అందుబాటులోకి తెచ్చారు. గతంలో పానీపూరిలో పానీని చేతితో గరిటె ద్వారా పోసేవారు. ఆ తర్వాత వివిధ రకాల పానీయాలను టిన్నుల్లో నింపి, పైపుల ద్వారా వినియోగదారులే పూరీల్లో పోసుకునే ఏర్పాటు చేశారు. అయితే, ఇప్పుడు మరింత ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ, ట్యాప్ కింద ఉంచితే చాలు.. సెన్సార్ల సహాయంతో పానీ నేరుగా పూరీలోకి చేరుతుంది. అయితే ఒక పూరీని మాత్రమే ఉంచితే ఈ వ్యవస్థ పని చేస్తుంది. పూరీ నిండిన తర్వాత పానీ రావడం ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది. ఈ విధానం ద్వారా పానీ పరిశుభ్రతను పాటించడంతో పాటు, ఆహార ప్రియులను మరింతగా ఆకర్షించవచ్చని వ్యాపారులు భావిస్తున్నారు. - బీచ్ రోడ్డు



రోస్టర్ సరిచేసి గ్రూప్–2 నిర్వహించాలి



సెల్‌ఫోన్ ఫ్లాష్ లైట్లు వెలిగించి నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

- 3వ రోజూ కొనసాగిన గ్రూప్–2 అభ్యర్థుల నిరసన

ఎంవీపీ కాలనీ: ఏపీపీఎస్సీ గ్రూప్–2 నోటిఫికేషన్ రోస్టర్ తప్పిదాలు సవరించాకే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలంటూ ఎంవీపీ కాలనీలోని ఆర్‌సీ రెడ్డి కోచింగ్ సెంటర్ ఎదుట మూడో రోజు శుక్రవారం కూడా అభ్యర్థులు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ గతంలో ఏపీపీఎస్సీ 904 ఖాళీలతో గ్రూప్–2 నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉండగా రోస్టర్‌లో దాదాపు 50 శాతం వరకు పోస్టులు కేటాయించినట్లు తెలిపారు. దీనిపై కోర్టులో వాదనలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇటీవల కోర్టు మెయిన్స్ పరీక్ష వాయిదా వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికే వదిలేస్తున్నట్లు స్పష్టం చేసిందన్నారు. ఈ ఆదివారం మెయిన్స్ జరగాల్సివున్న నేపథ్యంలో తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆందోళన కొనసాగించారు. సెల్ ఫోన్ ఫ్లాష్ లైట్లు వెలిగించి నిరసన తెలిపారు. ఏయూలో చదువున్నవారితోపాటు, వివిధ ప్రాంతాల్లో ఈ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులు చేరుకుని నిరసనకు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చే వరకు నిరసన ఆపేదిలేదన్నారు. పలువురు అభ్యర్థులతో కూడిన మరో బృందం విశాఖలోని ప్రజాప్రతినిధులను కలిసి, పరీక్ష వాయిదాకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాలని కోరుతూ వినతిపత్రాలు అందించింది. అభ్యర్థుల నిరసన నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు.

అన్ని ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు

- మాతా, శిశు ఆరోగ్య సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: అన్ని ప్రైవేట్, ప్రభుత్వ, బోధనాస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో మాతా, శిశు ఆరోగ్యం అడ్వైజరీ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులను ముందుగానే గుర్తించి, వారికి సరైన వైద్య సేవలు దక్కేలా వైద్యులు సహకారం అందించాలన్నారు. రోగులకు అందించే వైద్యం పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ కొన్ని మార్పులు చేయడం ద్వారా కేజీహెచ్‌లో మాతా, శిశు మరణాలు తగ్గాయన్నారు. సమావేశంలో కేజీహెచ్ చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ చక్రవర్తి, అగనంపూడి పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ వి.సత్యప్రసాద్, కేజీహెచ్ అనస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ వి.రవి, వైద్య ఆరోగ్యశాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు డాక్టర్ లూసీ, డాక్టర్ బి.ఉమావతి, ఎస్.జయదేవి, డాక్టర్ గీతా వందన, డాక్టర్ శ్రీదేవీ, ఐ.మనోరమ, బి.నాగేశ్వరరావు, బి.మురళీకృష్ణ, త్రినాథ్, షర్మిలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తల్లికి నీరాజనం



తెలుగు భాష పరిరక్షణకు తెలుగుతల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం: మాతృభాషా దినోత్సవం సందర్భంగా మద్దిలపాలెం కూడలిలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగు దండు ఆధ్వర్యంలో తెలుగు తల్లి కీర్తనలతో సందడి చేశారు. జీవీఎంసీ స్కూల్, వండర్ కిడ్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొని.. పాటలు, పద్యాలతో తెలుగు తల్లిని కీర్తించారు. తెలుగు దండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ యునెస్కో సూచన మేరకు 2000 సంవత్సరం నుంచి ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషాభిమానులు జరిపే ఏకైక 'విశ్వవేడుక' అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం అని కొనియాడారు. మాతృభాష కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా త్యాగం చేసిన బంగ్లాదేశ్ విద్యార్థులకు నివాళులర్పించారు. ఆ స్ఫూర్తితో తెలుగు వారంతా అమ్మభాషను కాపాడుకునేందుకు కంకణబద్ధులు కావాలన్నారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ తెలుగుభాష పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమాగాంధీ, కాశీవిశ్వేశ్వరం, చిన సూర్యనారాయణ, శ్రీధర్, కొచ్చెర్లకోట సత్యనారాయణ మూర్తి, భాగవతుల విశ్వనాథం, మదరిండియా మాధవి, పంతుల లలిత, పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొని తెలుగు తల్లికి నీరాజనాలు సమర్పించారు.

దిల్ మ్యాంగో మోర్.!

- ఈసారి ఆశాజనకంగా మామిడి దిగుబడి
- మంచు లేకపోవడంతో కొమ్మల నిండా పూత
- గతేడాది ఎకరాకు 1.5 టన్నుల మామిడి దిగుబడి
- ఈ ఏడాది 3 టన్నుల వరకూ వచ్చే అవకాశం
- అదే బాటలో జీడిమామిడి దిగుబడి
- జిల్లాలో 3 వేల హెక్టార్లలో మామిడి, 1200 హెక్టార్లలో జీడిమామిడి సాగు



కొమ్మల నిండా మామిడి పూత



మామిడి రైతులకు సూచనలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

జిల్లాలో మామిడి సాగు	3,000 హెక్టార్లు
పద్మనాభం	2000 హెక్టార్లు
భీమిలి	50 హెక్టార్లు
ఆనందపురం	400 హెక్టార్లు
పెందుర్తి	50 హెక్టార్లు
సేంద్రియ సాగు	30 హెక్టార్లు(పద్మనాభం)
గతేడాది ఎకరానికి దిగుబడి	1.5 టన్నులు
ఈ ఏడాది అంచనా	3 నుంచి 4 టన్నులు
జిల్లాలో జీడిమామిడి సాగు	**1200 హెక్టార్లు**
పద్మనాభం	400 హెక్టార్లు
సింహాచలం	200 హెక్టార్లు
ఆనందపురం	300 హెక్టార్లు
భీమిలి	300 హెక్టార్లు
గతేడాది ఎకరానికి దిగుబడి	150 కిలోలు
ఈ ఏడాది అంచనా	250 కిలోలు

సాక్షి, విశాఖపట్నం: గతేడాది నామమాత్రపు దిగుబడులు అందించిన మామిడి ఈసారి రైతుల్ని ఊరిస్తోంది. మొదటి దశలోనే మామిడిపూత విరబూసి అందరిలోనూ ఆశలు నింపుతోంది. జిల్లా వ్యాప్తంగా మామిడి తోటలు పూతలతో కళకళలాడుతున్నాయి. ముందుగానే పూతలు రావడం.. రెండో దశలోనూ నిలబడటంతో.. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కంటే ఈసారి దిగుబడి రెట్టింపు అయ్యే అవకాశాలున్నాయని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. మామిడి మాదిరిగానే... జీడి మామిడి కూడా భారీగా పూతతో రైతుల మోముల్లో ఆనందం నింపుతోంది.

కలిసొస్తున్న అనుకూల వాతావరణం

వాతావరణంలో చలితీవ్రత తప్ప.. అకాల వర్షాలు ఇంతవరకూ పడలేదు. దాదాపు ఏప్రిల్ చివరి వరకూ వానలు కురిసే సూచనలు కనిపించడం లేదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పొగమంచు తీవ్రత కూడా భయపడేంతగా లేదు. ఏటా పొగమంచు ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఉండేది. ఈసారి జనవరి చివరి నుంచే పొగమంచు దాదాపు తగ్గిపోయింది. ఇది మామిడి పూతకు ఎంతో అనుకూల వాతావరణమని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా మామిడి పూత నవంబర్ నుంచి ప్రారంభమవుతుంది. ఈ ఏడాది కొంచెం ముందుగానే పూత వచ్చింది. నవంబర్లో వచ్చిన మొదటి పూతతో పాటు డిసెంబర్లో ప్రారంభమైన రెండో దశ పూత కూడా బాగానే ఉంది. గతేడాదితో పోలిస్తే.. ఈసారి పెద్ద మొత్తంలో మామిడి పూత పూయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పూత నిలిస్తే మామిడి దిగుబడి భారీగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు రైతులు చెప్తున్నారు.

ఆశాజనకంగా మామిడి, జీడిమామిడి దిగుబడి

గతేడాది వాతావరణం అనుకూలించకపోవడం.. పొగమంచు, అకాల వర్షాల కారణంగా పూత నిలబడలేదు. ఈసారి పూత నిలబడటమే కాకుండా.. పలుచోట్ల పిందె స్థాయికి పంట చేరుకుంది. ఇదేరీతిలో వాతావరణం అనుకూలిస్తే.. దిగుబడి ఆశాజనకంగా ఉండనుంది. గతేడాది కంటే రెట్టింపు దిగుబడి వచ్చే సూచనలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. గత సంవత్సరం ఎకరానికి కేవలం ఒకటిన్నర టన్ను మాత్రమే దిగుబడి వచ్చింది. ఈ సారి 3 టన్నుల వరకూ వస్తుందని ఉద్యానవన శాఖ అధికారుల అంచనా. అయితే.. తేనెమంచు(బంక తెగులు) పురుగు, నల్లిపురుగు, బూడిద తెగులు ఆశించకుండా జాగ్రత్తలు పాటిస్తే.. మరింత దిగుబడి రావచ్చని అధికారులు చెబుతున్నారు. జీడిమామిడిలో కూడా అద్భుతంగా పూత ఉందనీ.. దీని దిగుబడి గతేడాది కంటే పెరిగే సూచనలున్నాయని చెప్తున్నారు. గతేడాది ఎకరానికి 150 కిలోల దిగుబడి మాత్రమే ఉందనీ.. ఈసారి 250 కిలోలకు పైగా వచ్చే అవకాశాలున్నట్లు పేర్కొంటున్నారు.



పిందెగా మారే సమయంలో జాగ్రత్తలు

ప్రస్తుతానికి మామిడి, జీడిమామిడి పూత, పిందె దశలో అద్భుతంగా ఉన్నాయి. పూత పిందె కింద మారుతున్నప్పుడు ఎట్టిపరిస్థితుల్లోనూ నీరు పెట్టకూడదు. నీరు పెడితే పిందె రాలిపోతుంది. నిమ్మకాయ సైజు వరకూ పెరిగిన తర్వాత మాత్రమే నీరు పెట్టాలి. పెస్ట్ మేనేజ్‌మెంట్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో లీటరు నీటిలో ఇమిడా క్లోరోపిడ్ 0.5 మి.లీ. 3 గ్రాముల బ్లిటాక్స్‌తో కలిపి పిచికారీ చెయ్యాలి. ఈ నెలాఖరులో లీటరు నీటిలో 2 మి.లీ. లామ్డా 10ఈసీ, 3 మి.లీ. కాంటాఫ్ కలిపి పిచికారీ చేస్తే సరిపోతుంది. పూత, పిందె నిలబడి దిగుబడి బాగా వస్తుంది. మరో నెలరోజులు వాతావరణం ఇదే తరహాలో అనుకూలంగా ఉంటే మామిడి తోటల రైతులు లాభాల బాట పడతారు. బయ్యర్ సెల్లర్ మీటింగ్ మే నెలలో నిర్వహిస్తాం.

– కె.సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి

ఈ–శ్రమ్ నమోదుతో బీమా సౌకర్యం



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

మహారాణిపేట: మత్స్యకారులు, మత్స్య అనుబంధ పరిశ్రమల్లో పనిచేస్తున్నవారు తప్పనిసరిగా నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాం(ఎన్ఎఫ్‌డీపీ)లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు(జేడీ) పి.లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో పీఎం మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన(పీఎంఎంకేఎస్ఎస్‌వై) పథకంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. మత్స్యకారులను అసంఘటిత కార్మికులుగా గుర్తించేందుకు ఈ–శ్రమ్ నమోదు చేయించుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వ బీమా సౌకర్యం పొందవచ్చన్నారు. ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా విశాఖ జోనల్ డైరెక్టర్ భామిరెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, అవకాశాలను వివరించారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్ఎఫ్‌డీబీ) హైదరాబాద్ అధికారి సుజిత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి, వాటిని పొందేందుకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌డీపీ ఈ శ్రమ్ కార్డుల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఐఎఫ్‌పీహెచ్ఏటీటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీనా, సీఐఎఫ్ఎస్ఈటీ డిప్యూటీ డైరెక్టర్ బిష్టోమ్, మత్స్యశాఖ ఎఫ్‌డివోలు ఆశాజ్యోతి, మురళి, డీపీఎం కృష్ణ, ఎంపెడా ప్రతినిధి హనుమంతరావు, రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, వివిధ సంఘాల నాయకులు సీహెచ్ వీర్రాజు, సీహెచ్ పోతురాజు, పరదేశి పాల్గొన్నారు.

భూ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

సీతమ్మధార: యూఎల్‌సీ పరిధిలో ఆక్రమణదారులు భూ క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 150 చదరపు గజాలు అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెం.27ను జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. రేసపువానిపాలెం, మద్దిలపాలెం, పెదవాల్తేరు, దొండపర్తి తదితర ప్రాంతాల్లోని 39, 40 సర్వే నెంబర్ల పరిధిలో యూఎల్‌సీ భూములు ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఏళ్ల తరబడి ఆక్రమించి నివాసం ఉంటున్న వారు ముందుగా ల్యాండ్ సర్వే చేయించుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆక్రమణ విస్తీర్ణం, ఆధార్ కార్డు, స్కెచ్ కార్డు, భూమి రికార్డులు తదితర పత్రాలను జతపరచి, సీతమ్మధారలోని తహసీల్దార్ కార్యాలయంలో అందించాల్సిందిగా సూచించారు.

రైల్వే కార్మికుల 'డిమాండ్ డే' నిరసన



డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూకు వినతిపత్రం అందిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ దేశవ్యాప్త పిలుపు మేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు ఆధ్వర్యంలో శుక్రవారం డిమాండ్ డే నిర్వహించారు. దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో కార్మికులు, యూనియన్ నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు సమస్యల పరిష్కారం కోసం వినతులు ఇస్తున్నా, రైల్వే శాఖ పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. ఓపీఎస్‌లో ఉన్న అన్ని అన్ని ప్రయోజనాలతో యూపీఎస్‌ను అమలు చేయాలన్నారు. పాయింట్స్ మెన్ కేటగిరీ ఉద్యోగులకు 4గ్రేడ్ పే అమలు, ఉద్యోగుల పిల్లలకు ఉన్నత చదువుకు ఎడ్యుకేషనల్ అలవెన్సులు తదితర 50 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూకు అందించారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ అధ్యక్షుడు పీవీజే రాజు, కార్యదర్శి బి.దామోదరరావు, ఆర్‌వీఎస్ఎస్ రావు, వెల్ఫేర్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు ఎం సన్యాసిరావు, గౌతం దేవ్, ఇతర కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి దారుణ హత్య

- నరవ క్వారీలో దహనం చేసిన దుండగులు



ఘటనా స్థలంలో పోలీసులు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి నరవలో గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నరవ సమీపంలోని అటవీ ప్రాంతానికి దగ్గరగా గ్రావెల్ తవ్వకాలు జరిగిన గొయ్యిలో హత్యకు గురైన వ్యక్తిని దహనం చేశారు. సగానికి పైగా కాలిపోయిన మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తీవ్ర సంచలనం రేపిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నరవ సమీపంలోని ఓ క్వారీ గొయ్యిలో సుమారు 25–35 వయసు కలిగిన యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సీఐ కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ జరిపారు. ప్రాథమిక విచారణ అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ మృతుడు నీలం రంగు ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. పెందుర్తితో పాటు నగరం, ఇతర ప్రాంత పోలీస్ స్టేషన్లలో మిస్సింగ్ కేసులను పరిశీలించి మృతుని వివరాల కోసం ఆరా తీస్తామన్నారు. సమాచారం కోసం 94407 96039, 96767 97314 ఫోన్ నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

యూసీసీ క్రికెట్ విజేత విజయనగరం

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్ విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. రైల్వే స్టేడియంలో జరిగిన ఫైనల్లో కావలీర్స్ జట్టుపై 57 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజయనగరం జట్టు 8 వికెట్లకు 209 పరుగులు చేయగా, కావలీర్స్ జట్టు 152 పరుగులకు ఆలౌటైంది. ఫైనల్స్‌లో బెస్ట్‌గా రవికిరణ్, టోర్నీ బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా కేఎస్ఎస్ రాజు, బెస్ట్ బౌలర్‌గా క్రాంతి, టోర్నీ ఓవరాల్ బెస్ట్‌గా వాసు నిలిచారు. బహుమతి ప్రదానోత్సవంలో జీజేజే రాజు, కరణ్, సోనా దోనా, పవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నలుగురు చిన్నారులకు రూ.లక్ష సాయం అందించారు.

పారా అథ్లెటిక్స్‌లో నేత్ర విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కొమ్మాది: బీచ్‌రోడ్డులోని వారిజ ఆశ్రమ నేత్ర విద్యార్థులు 23వ జాతీయ పారా(దివ్యాంగుల) అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా ఈ నెల 17 నుంచి 20 వరకు జరిగిన పోటీల్లో ఆశ్రమానికి చెందిన కిర్లాక లలిత టీ–11 కేటగిరీ 400, 200 మీటర్లు, వలసనయుని రవణి 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 400, 200 మీటర్ల పందెంలో వెండి పతకాలు సాధించారు.